ప్రజాశక్తి
శనివారం 6 జనవరి 2024
5
శ్రీ సత్యసాయి





స్పృహ కోల్పోయిన కార్మికులను 108లో ఆసుపత్రికి తరలిస్తున్న తోటి కార్మికులు



విద్యుత్ దీపాలంకరణలో జెఎన్‌టియు ఎన్టీఆర్ ఆడిటోరియం

నేడు స్నాతకోత్సవ సంబరం

◆ ముస్తాబైన అనంత జెఎన్‌టియు ◆ ముఖ్య అతిథిగా రానున్న గవర్నర్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు 13వ స్నాతకోత్సవ సంబరానికి అంతా సిద్ధం అయ్యింది. శనివారం ఉదయం జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి ఎన్టీఆర్ ఆడిటోరియంను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో భవనంను అలంకరించారు. సభికులకు కుర్చునే సీటింగ్, డయాస్‌ను అన్ని వసతులతో అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. స్నాతకోత్సవ రిహార్సల్స్‌ను జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగ జనార్ధన నేతత్వంలో శుక్రవారం నిర్వహించారు. కాన్విగేషన్ ప్రాసెస్, సమయపాలనలో జరగాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఎటువంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు వర్సిటీ యంత్రాంగం చేపట్టింది. గవర్నర్ రాక నేపథ్యంలో వర్సిటీ ప్రాంగణమంతా పోలీస్ పర్యవేక్షణలోకి వెళ్లింది. కాన్విగేషన్‌కు వచ్చే అతిథులు, విద్యార్థులకు ప్రత్యేక పాసులు జారీ చేశారు. ఇప్పటికే కాన్విగేషన్ కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్ర రెడ్డి, డాక్టరేట్ అందుకోనున్న ఆచార్యకే బాల వీరారెడ్డి, ముఖ్య అతిథి వి.సత్యనారాయణ రాజు శుక్రవారం సాయంత్రమే నగరానికి చేరుకున్నారు. వారికి వర్సిటీ ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. కలెక్టర్ గౌతమి, జిల్లా పోలీసు యంత్రాంగం గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు.



కాన్విగేషన్ రిహార్సల్స్‌లో పాల్గొన్న జెఎన్‌టియు ఉన్నతాధికారులు

ఉదయం 11 గంటలకు ప్రారంభం

స్నాతకోత్సవం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం 12:30గంటల వరకు జరగనుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 71 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 265 మందికి పిహెచ్‌డి డిగ్రీలు, బీటెక్, బీ ఫార్మసీ పూర్తి చేసిన 68,963 మందికి, ఎంటెక్, ఎం ఫార్మసీ తదితర పీజీ కోర్సులు పూర్తి చేసన 16,914 మందికి డిగ్రీ పట్టాలను గవర్నర్ చేతుల మీదుగా విద్యార్థులు అందుకోనున్నారు.



కార్మికులపై జులుం

◆ మున్సిపల్ కార్మికులపై ఖాకీల కర్కశం
◆ కాళ్లు పట్టుకున్నా కరుణించని వైనం
◆ తోపులాటలో సొమ్మసిల్లిన మహిళా కార్మికులు
◆ నాయకుల అరెస్టు... పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-హిందూపురం

న్యాయమైన సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేస్తున్న ఆందోళన శుక్రవారం నాడు హిందూపురంలో ఉద్రిక్తమైంది. సమ్మెను విచ్ఛిన్నం చేసే క్రమంలో భాగంగా కమిషనర్ ప్రమోద్ కుమార్ పోలీసులను అడ్డుపెట్టుకుని సచివాలయ ప్రయివేటు కార్మికులతో పనులు చేయించడానికి సిద్ధపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు పనులను కార్మికులు అడ్డుకోవడానికి యత్నించారు. పనులు చేయడానికి వచ్చిన కార్మికులను పనులు చేయవద్దని కోరారు. అయినప్పటికీ వారు పనులు చేయడానికి సిద్ధపడ్డారు. కార్మికులు అడ్డుకునేందుకు ప్రయత్నించగి పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. తాము న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నామని, దీనిని విచ్ఛిన్నం చేసే చర్యలను ప్రోత్సహించొద్దంటూ పోలీసుల కాళ్లు పట్టుకున్నారు. అయినా వారు కనకరించలేదు. కార్మికులను రోడ్డుపై ఈడ్చిపారేస్తూ జులుం ప్రదర్శించారు. కార్మిక యూనియన్ నాయకులు రంగనాథ్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించేయత్నం చేశారు. ఆ వాహనాన్ని మహిళా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వెనుక నుంచి వాహనాన్ని స్టేషన్‌కు తీసుకెళ్లారు. మున్సిపల్ యూనియన్ కార్యదర్శి జగదీష్‌తో పాటు మరి కొంతమంది నాయకులను అరెస్టు చేయడానికి పోలీసులు ముందుకు వచ్చారు. అరెస్టును కార్మికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో మహిళలు అని చూడకుండా పోలీసులు వారిని ఈడ్చి పారేశారు. ఈ తోపులాటలో కార్మికులు అంజనమ్మ, లక్ష్మీదేవి, పద్మావతిలు స్పృహ కోల్పోయారు. కమలమ్మ చెయ్యికి రక్త గాయాలయ్యాయి. స్పృహ కోల్పోయిన కార్మికులకు ఏమైంది అని చూసే లోగా సిఐటియు జిల్లా నాయకులు సాంబ శివ, రాము, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి జగదీష్‌తో మరి కొంతమందిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. తోపులాటలో స్పృహ కోల్పోయి రోడ్డుపై పడిపోయిన మహిళల పక్కన కార్మికులు కుర్చోని పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, మున్సిపల్ కమిషనర్, సచివాలయ ఉద్యోగులు వేడుక చూస్తూ ఉండిపోయారు.



అరెస్టు చేసేందుకు కార్మికులను బలవంతంగా లాగుతున్న పోలీసులు



మహిళా కార్మికురాలిని ఈడ్చివేస్తున్న సచివాలయ ఉద్యోగులు



స్పృహ కోల్పోయిన కార్మికురాలు అంజినమ్మ

చివరికి కార్మికులు 108కు ఫోన్ చేసి సహ కోల్పోయిన మహిళలతో పాటు రక్త గాయాలైన కమలమ్మను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్టేషన్ ముందు ఆందోళన

అరెస్టు చేసిన యూనియన్ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు వన్‌టౌన్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. చివరకు పోలీసులు అరెస్టు చేసిన నాయకులను విడుదల చేశారు. దీంతో కార్మికులు చేస్తున్న ఆందోళన విరమించారు. అక్కడ నుంచి అందరూ మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు.

వేతనాలు పెంచుతాం - మున్సిపల్ కమిషనర్

వన్‌టౌన్ స్టేషన్‌లో డిఎస్‌పి కంజాక్షన్ సమక్షంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ యూనియన్ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు సాంబశివ, యూనియన్ కార్యదర్శి జగదీష్‌లు కరోనా విపత్కర సమయంలో తాత్కాలిక కార్మికులుగా తీసుకున్న 85 మంది కార్మికులకు కొనసాగిస్తూ, వారికి వేతనాలు పెంచాలని, అదే సమయంలో మరో 15 మందిని తీసుకొని వారిని ఇంటికి పంపారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, అదేవిధంగా ప్రతి నెల వేతనాలు సక్రమంగా చెల్లించడంతో పాటు స్థానికంగా ఉన్నా సమస్యలను పరిష్కరించాలని కోరారు. తాత్కలిక కార్మికులుగా తీసుకున్న వారికి రూ.400 నుంచి 540 వరకు పెంచుతామని, అదనంగా తీసుకోవాల్సిన 15 కార్మికులను అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోంటానని కమిషనర్ హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు స్టేషన్ ముందు చేస్తున్న ఆందోళన విరమించారు.

తేలుస్తారా.. తేల్చమంటారా..?

బెదిరించినా సమ్మె ఆగదు : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-హిందూపురం

'అంగన్వాడీల సమస్యలను తేలుస్తారా... లేక వచ్చే ఎన్నికల్లో నీ స్థానాన్ని తాము తేల్చమంటారా' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ సిఎం జగన్‌ను అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి చేతగాని ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని అంగన్వాడీలపై బెదిరింపులకు పాల్పడితే సమ్మె ఆగదని స్పష్టం చేశారు. అంగన్వాడీల సమ్మెలో భాగంగా 25వ రోజు శుక్రవారం చేపట్టిన దీక్షకు రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మద్దతు తెలిపారు. రాంభూపాల్ మాట్లాడుతూ అంగన్వాడీలు, సిఐటియు నాయకులపై చిలమత్తూరు పోలీసులు అక్రమ కేసులు బనాయించడం తగదని, వెంటనే ఉపసంహరించుకో వాలని డిమాండ్ చేశారు. స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన కేసుకు ఎఫ్ఐఆర్‌లో మరిన్ని సెక్షన్లు చేర్చి ప్రజా సమస్యలపై పోరాడే నాయకులపై బెయిల్ రాకుండా చూడడం, పిటి వారెంట్లు వేయడం చూస్తుంటే అధికార పార్టీకి చిలమత్తూరు ఎస్ఐ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నా రని అర్థం అవుతోందన్నారు. ఎస్ఐ ప్రవర్తన మార్చుకోవాలని, లేనిచో ప్రయివేటు కేసులు వేస్తామని హెచ్చరించారు. సిఎం ఇచ్చిన హామీలనే అమలు చేయాలని సమ్మె చేయాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. జిల్లా కలెక్టర్ల ద్వారా అంగన్వాడీలను బెదిరించడం అప్రజాస్వామికం అన్నారు. ప్రతిపక్షనేతగా అంగన్వాడీలకు మద్దతు ఇచ్చిన జగన్ నేడు సమ్మెను అణచాలని చూస్తే తిరిగి ప్రతిపక్షంలోనే కూర్చోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అంగన్వాడీలకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య కోశాధికారి శిరీష, శైలజ, రీహనా, వరలక్ష్మి, వాణి, శ్రీ వాణి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : అంగన్వాడీల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. వీరికి ఉద్యోగ విరమణ చెందిన అంగన్వాడీ కార్యకర్తలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీరాములు, రమేష్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిల్చొని చేతులెత్తి మొక్కుతూ నిరసన తెలిపారు. ఒడిసి, అమడగూరు మండలాల నుంచి వచ్చిన అంగన్వాడీలు సమ్మెలో పాల్గొన్నారు. దీక్షలో సిఐటియు శ్రీరాములు, కుళ్లాయప్ప, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆశీర్వాదమ్మ, మణిమాల, వరలక్ష్మి, కమలమ్మ. అరుణమ్మ, సరళమ్మ. పద్మావతమ్మ, లక్ష్మీదేవి, కిష్టమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : అంగన్వాడీల పట్ల ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షలను కొనసాగించారు. వీరికి పెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎల్ ఆదినారాయణ తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పోతక్క, దీనా, గోవిందమ్మ, మాంచాలినిదేవి, అనిత, కృష్ణవేణి, భువనేశ్వరి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: అంగన్వాడీలు స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన శిబిరంలో సమ్మెను కొనసాగించారు. గంగిరెడ్డుకు వినతి పత్రం అందజేశారు. ఆర్డీవో కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, బాళ్ల అంజి, ప్రాజెక్టు, సెక్టారు లీడర్లు అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీలు ఒంటి కాలిపై నిలబడి దండాలు పెడుతూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు రజియా, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు

నల్లమాడ : అంగన్వాడీలు మూతికి నల్ల బ్యాడ్జీలు కట్టుకొని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలోఅంగన్వాడీలు, సిఐటియు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు

చెన్నేకొత్తపల్లి : సమ్మెలో భాగంగా చెన్నేకొత్తపల్లిలో శుక్రవారం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా కమిటీ అధ్యక్షుడు కదిరప్ప ఆధ్వర్యంలో ఛార్జ్‌మెమోలు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్ లక్ష్మీదేవి, రామగిరి, కనగానపల్లి మండలాల కార్యదర్శులు చామంతి, అనిత, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



చెన్నేకొత్తపల్లిలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ఆధ్వర్యంలో ఛార్జ్‌మెమోలు దహనం చేస్తున్న అంగన్వాడీలు

సోమందేపల్లి : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో అంగన్వాడీలు స్థానిక సాయిబాబా గుడి ఆవరణలో ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డిమాండ్లను నెరవేర్చేంత వరకూ ఎట్టి పరిస్థితుల్లో సమ్మెను ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడీ సిబ్బంది ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు శ్రీదేవి, ఉషారాణి మాట్లాడుతూ 25 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఒంటి కాలిపై నిల్చొని సిఎం జగన్‌కు మొక్కారు. డిమాండ్లను నెరవేర్చని పక్షంలో దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు.

అగళి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ మినీ అంగన్వాడీల కార్యకర్తలు, హెల్పర్లు ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఇకనైనా సిఎం జగన్ అంగన్వాడీలపై మొండి వైఖరి వీడి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అంతవరకూ పోరాటం ఆగదని తెలిపారు.

పెనుకొండ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్వాడీలు నాసిరకం చీరలు, పాడైపోయిన సెల్‌ఫోన్లు మాకిస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకులు శివరామకృష్ణ, గౌరవాధ్యక్షులు వెంకటేష్, రవి, కదిరిప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శులు రమేష్, లక్ష్మినారాయణ, పెదబల్లి బాబా, పైపల్లి గంగాధర్, రమణ, రాజగోపాల్ మద్దతు తెలిపారు. దీక్షలో యూనియన్ నాయకురాళ్లు బావమ్మ, జయమ్మ, సెక్టార్ లీడర్లు మాబున్నీసా, వరలక్ష్మి, అనిత, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా అంగన్వాడీ సిబ్బంది స్థానిక ఐసిడిఎస్ కార్యాల యం ముందు కళ్లకు గంతలు కట్టుకొని ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి మహదేవమ్మ మాట్లాడుతూ హామీలు అమలు చేయని పక్షంలో రాబోయే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కోశాధికారి లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.



హిందూపురంలో అంగన్వాడీలకు సంఘీభావం తెలుపుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్



సోమందేపల్లిలో ఒంటికాలిపై నిల్చొని నమస్కరిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

వైసిపిని వీడిన 'కాపు'

◆ రాజీనామా చేస్తున్నట్టు ప్రకటన
◆ రాయదుర్గం, కళ్యాణదుర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తాం : కాపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, రాయదుర్గం



ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వైసిపిని వీడుతున్నట్టు ప్రకటించారు. నమ్మించి తన గొంతు కోశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తాను రాయదుర్గం, తన భార్య కాపు భారతి కళ్యాణదుర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయనున్నట్టు కూడా ప్రకటించడం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వైఎస్ కుటుంబాన్ని నమ్మిన వ్యక్తిగా చెబుతారు. అందుకే ఆయన వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ వెంటనే ఉంటూ వచ్చారు. 2009లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులతో ఆయన కాంగ్రెసులోకి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. జిల్లాలో సీనియర్ నాయకుడైన పాటిల్ వేణుగోపాల్‌రెడ్డిని కూడా కాదని కాపు రామచంద్రారెడ్డికి టిక్కెట్టు ఇచ్చారు. తొలి ప్రవేశంలోనే ఎమ్మెల్యేగానూ ఎన్నికయ్యారు. వైఎస్ మరణం తరువాత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వైసిపిని ఏర్పాటు చేశాక కాంగ్రెస్ పార్టీని వీడి ఆ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు 12 మంది ఉన్నారు. అందులో కాపు రామచంద్రారెడ్డి ఒకరు. వైసిపిలో చేరిన 12 మంది ఎమ్మెల్యేలు పదవికీ రాజీనామాలు చేసి ఉప ఎన్నికలకు వెళ్లగా అందులో 12 మంది గెలుపొందారు. ఈ గెలుపొందిన వారిలో రాయదుర్గం నియోజకవర్గం నుంచి కాపు రామచంద్రారెడ్డి, అనంతపురం నుంచి ఎమ్మెల్యే గురునాథరెడ్డిలున్నారు. 2012లో జరిగిన ఆ ఉప ఎన్నికల్లో ఈ ఇద్దరూ గెలుపొందారు. 2014 ఎన్నికల్లోనూ కాపు రాయదుర్గం నుంచి పోటీ చేసినప్పటికీ స్వల్ప ఓట్ల మెజార్టీతో ఓడిపోయారు. 2019లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. బిసి కూడా కావడంతో ఆయన మంత్రి పదవి వస్తుందన్న ప్రచారం నడిచింది. అయితే ఆయన ఈ పదవి లభించలేదుగానీ, ప్రభుత్వ విప్‌ను ఇచ్చారు. ఈ ఎన్నికల్లోనూ ఆయనకు స్థానముంటుందని భావించినప్పటికీ గత కొన్ని రోజులుగా ఆయన్ను నియోజకవర్గం మార్పు చేస్తారని ప్రచారం నడించింది. అందుకు తగ్గట్టుగా కాపు రామచంద్రారెడ్డి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పర్యటించడం, తనకు ఈ నియోజకవర్గం నుంచి అవకాశముండనుందని సన్నిహితుల వద్ద కూడా ప్రకటించారు. కాని ఇటీవల విడుదలైన జాబితాలో కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్తగా అనంతపురం పార్లమెంటు సభ్యులు తలారి రంగయ్యను నియమించారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే హుటాహుటిన ఆయన విజయవాడకు పయనమై వెళ్లారు. అప్పటి నుంచి వివిధ రూపాల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసే ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. ఆయన కూడా మీడియాతో మాట్లాడే సమయంలో స్వయంగా వెల్లడించారు. ముఖ్యమంత్రిని కలుద్దామని ప్రయత్నించినా అపాయంట్‌మెంట్ దొరకలేదని ఆయన తెలిపారు. దీంతో తాను స్వతంత్రంగా బరిలో దిగుతానని ప్రకటించడం చర్చనీయాంశమవుతోంది. నాలుగు అసెంబ్లీ స్థానాల మార్పు తరువాత తొలిసారిగా జిల్లాలో వ్యతిరేక గళం వినబడింది. పూర్తిస్థాయి జాబితా బయటకు వస్తే ఏ విధంగా ఉండనుందన్నది రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ మార్పులు రాబోయే ఎన్నికల సమయంలో వైసిపికి ఏ మేరకు ప్రభావం చూపనున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో పెద్దఎత్తునే అభ్యర్థుల మార్పులుంటాయన్న ప్రచారం ముందు నుంచి నడుస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రకటన తరువాత ఇటువంటి పరిణామాలు ఇంకెన్ని ఉంటాయన్నది చూడాల్సి ఉంది.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'ని వేగవంతం చేయండి

మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా 'బాబు ష్యూరిటీ–భవిష్యతుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని వేగవంతం చేయలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సూచించా రు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ మండల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శు లు, క్లస్టర్, యూనిట్, బూత్, ఇన్‌ఛార్జులందరూ ఈ నెల 10 తేదీ లోపు 90 శాతం పూర్తి చేయలన్నా రు. ఈ నెల 12వ తేదీ బాలాజీ నగర్ పార్టీ కార్యాలయంలో మండలాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని, కావున అన్ని మండలాల నాయకులు, 90 శాతం పూర్తి చేయని క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌ఛార్జులు, అనుబంధ సంఘాల నాయకులు తప్పకుండా హాజరుకావాలని తెలిపారు.

పైపులైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే భూమిపూజ

పెనుకొండ : పట్టణంలోని షీప్ ఫామ్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ హెచ్‌డిపిఇ పైపులైన్ పనులకు శుక్రవారం ముఖ్య అతిథి ఎమ్మెల్యే శంకరనారాయణ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉమర్‌ఫరూక్‌ఖాన్, కమిషనర్ వంశీకృష్ణభార్గవ, వైస్ ఛైర్‌పర్సన్ సునీల్, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిల సాధికారత

ప్రజాశక్తి-పెనుకొండ

బిసిల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత జెండా, అజెండానే టిడిపి అజెండా అని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం తర్వాతే బిసిలకు గుర్తింపు వచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి బిసిలకు ద్రోహం చేసిందన్నారు. బిసిలు ఆర్థికంగా ఎదగడానికి టిడిపి ఎంతో కృషి చేసిందన్నారు. 90 శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు అందించగా జగన్ పాలనలో బిసిలకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. కార్పొరేషన్లు పెట్టి నిధులు లేకపోతే ఏం లాభం అన్నా రు. టిడిపి హయాంలో ఆదరణ ద్వారా వెయ్యి కోట్లు ఇచ్చి ఆదుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించడానికి బిసిలంతా ఏకమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, డివి ఆంజనేయులు, ఆంజనేయులు, నరసింహులు, ప్రసాద్, సోము, నరసింహులు, రాజగోపాల్, మంజునాథ్, వాసుదేవరెడ్డి, సనావుల్లా, నిస్సార్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం



పుట్టపర్తిలో మున్సిపల్ కార్మికుల పొర్లు దండాలు





పెనుకొండ, ధర్మవరంలో నిర్వహించిన సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు వినూత్న రీతిలో పొర్లు దండాలతో నిరసన తెలిపారు. అనంతరం ఈఎస్ వెంకటేష్, మున్సిపల్ కార్మికుల జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. పారిశుధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడినా ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను మాత్రమే తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్, రవాణా రంగం జిల్లా కార్యదర్శి పెడపల్లి బాబా, ఒడిసి మండల కార్యదర్శి రమణ, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు పెద్దన్న, గోవిందు, నాగార్జున, నరసింహులు, సాయి, మారెక్క తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు, కార్మికులు రోడ్డుపై పొర్లుదండాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వీరి సమ్మెకు బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ, గౌరవాధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ తదితరులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ నగర పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సిపిఎం సభ్యులు తిప్పన్న, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు వెంకటేష్, చంద్ర కార్మికులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 11 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదకొండు రోజులనుంచి సమ్మెలో ఉంటే, కార్మిక సమస్యలు పరిష్కరించకపోగా పోటీ కార్మికులతో పని చేయించడం అన్యాయమన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని క్లాప్ డ్రైవర్లకు రూ. 18500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జనార్ధన, రాజు, సూరి, చిన్నకృష్ణ, చంద్రప్పతోపాటు సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 11వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెదక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబుళేశు, ఉపాధ్యక్షులు ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ముకుంద, అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగపు ఉద్యోగ కార్మికసంఘం అధ్యక్షులు అద్రామహేశ్, ప్రధానకార్యదర్శి బొగ్గునాగరాజు, సహాయకార్యదర్శి సాకే బాబు, కోశాధికారి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు దాసరిసురేశ్, అంకే పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

సోమందేపల్లి : స్థానిక గాంధీనగర్‌కు చెందిన సరస్వతమ్మ గత నెలలో మృతిచెందింది. ఆమె కుమార్తె స్వాతికి శుక్రవారం మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవినరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు వైఎస్ఆర్ బీమా మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో పృథ్వీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

పెనుకొండ : పట్టణంలోని ప్రగతి పాఠశాల ఆవరణలో శుక్రవారం కరస్పాండెంట్ యు.శ్రీనివాసు లు ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి వేడుకగా సంక్రాంతి ఉత్సవాలను జరుపుకొన్నారు. నేటి తరం విద్యార్థులకు మన పండుగలు-సంప్రదాయాలు తెలియజేయడమే ఉత్సవాల ఉద్దేశమని కరస్పాండెంట్ తెలిపారు.

28న మూర్ఛ చికిత్స శిబిరం

పెనుకొండ : ఈ నెల 28వ తేదీ పట్టణంలోని ఘనగిరి పాఠశాల వద్ద జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూర్ఛ వ్యాధి చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు జెవివి నాయకులు తెలిపారు. శిబిరం పోస్టర్‌ను శుక్రవారం డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్ ఆవిష్కరించారు. జెవివి కమిటీ సభ్యులు మాట్లాడుతూ శిబిరాన్ని ప్రతి నెలా నాల్గవ ఆదివారం ఏర్పాటు చేస్తామని, ప్రజలు ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. హరి-94913 55200, నబి-76808 24364, ఇమ్రాన్-93989 13631 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేణు, జిల్లా కార్యదర్శి హరి, జోన్ అధ్యక్షులు నబి, జోన్ ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్‌బాషా, యుటిఎఫ్ రమేష్, కోగిర జయచంద్ర, లెక్చరర్ జయప్ప, బాబు, తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి

ధర్మవరం టౌన్ : నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 12న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర కోరారు. ఈ సందర్భంగా వారు చలో ఢిల్లీకి సంబందించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో బిజెపి ప్రభుత్వం దేశ సంపదను అమ్మేస్తూ ఉద్యోగ అవకాశాలు లేకుండా చేయడం దారుణమని అన్నారు. విద్యార్థి, నిరుద్యోగ యువత దేశంలో బిజెపిని వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌యు నాయకులు నందకిషోర్, ప్రశాంత్, సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నంబులపూలకుంట : మండల పరిధిలోని పెడబల్లి పంచాయతీలో సోలార్ పవర్ ప్రాజెక్టు (సి ఎస్ ఆర్ ఫండ్స్) నిధులతో సిసిరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. సోలార్ పవర్ ప్రాజెక్టు నిధులు రూ. 70 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులను చేపడుతున్నట్లు సోలార్ పవర్ ప్రాజెక్ట్ అధికారి శివ శంకర్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం హరీష్ రెడ్డి, మహేష్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, పుల్లారెడ్డి, సిద్దారెడ్డి, నారాయణస్వామి, రమేష్ రెడ్డి, ఈశ్వర్, శివయ్య, కిట్టు పాల్గొన్నారు.

అడవులను రక్షించుకుందాం

పుట్టపర్తి రూరల్: అడవులను సంరక్షించుకొని పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ - విశిష్టతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల బాధ్యతలు, వారి భవిష్యత్తు, ప్రకృతిని ఎలా కాపాడుకోవాలి అన్నదానిపై వివరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ నాయుడు, పిఇటి రామకృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'పది' మోడల్ పేపర్లు పంపిణీ

పెనుకొండ : యుటిఎఫ్ రాష్ట్ర శాఖ రూపొందించిన ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్‌ను శుక్రవారం మండలంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సెంట్రల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, రాంపురం ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో హెచ్ఎం చేత విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు జ్యోతి, రామకృష్ణ, దాలప్ప, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.రమేష్, మండల అధ్యక్షులు ఉపేంద్ర, ఆదిజినేష్, తిప్పేస్వామి, గాయత్రి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండల పరిధిలోని చోలేమర్రి ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాజీ సర్పంచ్ అప్పిరెడ్డి సహకారంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ పేపర్స్ పంపిణీ చేశారు. రొద్దం జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం శ్రీరాములు చేత విద్యార్థులకు మోడల్ పేపర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు నారాయణస్వామి, నాయకులు సత్యమయ్య, శేషాద్రి, ముత్యాలప్ప, సాయినాథ్‌రెడ్డి, వెంకటేశులు, షమీమ్, రోహిణి, వెంకటరమణ, మమత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మోడల్ ప్రశ్నాపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిలమత్తూరు ఎస్ఐను సస్పెండ్ చేయాలి

ఆయన రాజకీయ నాయకుల ఏజెంట్ - సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్



ప్రవీణ్‌కుమార్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

విధినిర్వహణను గాలికి వదిలేసి రాజకీయనాయకులకు ఏజెంటుగా వ్యవహరిస్తున్న స్థానిక ఎస్ఐ గంగాధర్‌ను సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. వ్యకాసం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్‌పై అక్రమ కేసు నమోదు చేసిన నేపథ్యంలో ఇంతియాజ్ శుక్రవారం ప్రవీణ్‌కుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల ఉద్యమంలో భాగంగా వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన అంగన్వాడీలకు సచివాలయ ఉద్యోగికి మధ్య జరిగిన వాగ్వాదంలో ఉద్యోగి అనుసరించిన విధానాన్ని ఖండించిన ప్రవీణ్‌కుమార్‌పై రాజకీయనాయకులు, పోలీసులు కక్షకట్టి కేసు నమోదు చేశారన్నారు. సచివాలయ ఉద్యోగి తన పరిధి దాటి మహిళలను కించ పరిచి మాట్లాడటాన్ని సిఐటియు నాయకులు ఖండించి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేస్తే దీనిని తప్పించుకోవడానికి ఆ ఉద్యోగి కౌంటర్ కంప్లైంట్‌ను అసరాగా చేసుకొని రాజకీయ,రియాల్టర్ లతో జత కట్టి వారికి మేలు చేసేందుకు ప్రవీణ్ కుమార్‌పై స్థానిక ఎస్ఐ అక్రమ కేసు నమోదు చేశాడని విమర్శించారు. ప్రభుత్వ స్థలంలో పేదల గుడిసెలు తొలిగించి రియాల్టర్లకు మేలు చేసే కుట్రలో భాగంగానే ఈ అక్రమ కేసు బనాయించారని అన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అడ్డుకోలేరని హెచ్చరించారు. స్థానిక ఎస్ఐ అధికారపార్టీ, రాజకీయ ఏజెంట్ గా వ్యవహరించి అక్రమ కేసు నమోదు చేశాడని అన్నారు. చట్టాన్ని ఉల్లంగించి అక్రమంగా కేసు బనాయించిన ఎస్ఐ గంగాధర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సాంబ, రాము, వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, శోభమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

సమస్యల నిలయంగా ధర్మవరం : పరిటాల



వార్డును పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే సమస్యలకు నిలయంగా మార్చారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన చేపట్టిన ప్రజాచైతన్య పాదయాత్ర రెండవరోజు శుక్రవారం కొనసాగింది. ఈసందర్భంగా పరిటాల శ్రీరామ్ పలు కాలనీల్లో పర్యటించారు. శాంతినగర్, చంద్రబాబునగర్, శారదానగర్, శివానగర్, తిక్కస్వామినగర్, సీపీఐకొట్టాల, కేశవనగర్‌లో పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా పలు కాలనీల్లో ప్రజలు తమ సమస్యలను పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు, డ్రయినేజీలు, రేషన్‌కార్డులు, పింఛన్లు ఇలా పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. మైనార్టీ నేతలు పరిటాల శ్రీరామ్‌నుకలిసి వినతిపత్రం అందజేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ, ముస్లీం మైనార్టీలను వివక్షకు గురికాకుండా అట్రాసిటీ చట్టం, దుల్హన్ పథకాన్ని రూ.50వేల నుంచి రూ.1లక్షవరకు పెంచాలని, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు, 50శాతం సబ్సిడీతో రుణాలువంటి అంశాలను పరిటాల శ్రీరామ్ దష్టికి తెచ్చారు.

పలువురు టిడిపిలో చేరిక : పరిటాల శ్రీరామ్ చేపట్టిన పాదయాత్రలో భాగంగా 5వ వార్డులో వైసీపీలో కీలకంగా పనిచేస్తున్న 30 మంది యువకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ శ్రీరామ్ వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నిజాం, అరవింద్, మహమ్మద్, కుల్లాయి, మనీ, ప్రశాంత్రెడ్డి, యతీహ్, వెంకటేశ్ తదితరుల ఆధ్వర్యంలో పార్టీలోకి చేరారు.

గాలిమాటలు నమ్మొద్దు : గాలిమాటలు నమ్మవద్దని, ధర్మవరంలో టీడీపీ జెండా ఎగురవేసేది పరిటాలశ్రీరామే అని మాజీ మంత్రి పరిటాల సునీత పార్టీ కార్యకర్తలకు చెప్పారు. పరిటాలశ్రీరామ్ రెండవ రోజు చేపట్టిన పాదయాత్రలో మాజీ మంత్రి పరిటాల సునీత పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు కాలనీలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ... పరిటాల శ్రీరామ్ పాదయాత్రకు మంచి స్పందన వస్తోందన్నారు.

బాలల చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

బాలల సర్వతో ముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ సమితి ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో పలువురు మాట్లాడుతూ బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సి డబ్ల్యు సి చైర్మన్ రామలక్ష్మి, సభ్యురాలు కామేశ్వరి, జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మి కుమారి, డిప్యూటీ డిఈవో రంగస్వామి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి శివ రంగప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రామ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి నిర్మలా జ్యోతి, డిసిపిఓ మహేష్ , బాలల సంరక్షణ సమితి అధికారులు మురళి, నాగలక్ష్మి ,మల్లేష్ రెడ్డి, చైల్డ్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారి, జిల్లా శిశు గహ మేనేజర్ సునీత, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ హాస్టళ్ల అధికారులు, వివిధ ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపల్స్, కేజీబీవీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించి కమిషన్ ద్వారా పటిష్ట చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రభుత్వ యంత్రాంగం బాలల హక్కుల పరిరక్షణకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లాలో బాల కార్మికులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా బాల కార్మికులతో పనిచేస్తుంటే వారిని పాఠశాలలో చేర్పించేలా చూడాలన్నారు. మీడియా వార్తా కథనాలపై స్పందించి వాస్తవాలను జిల్లా కలెక్టర్, కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం

ధర్మవరం టౌన్ : చదువుతో పాటు క్రీడలు చాలా అవసరమని ఆత్మీయట్రస్టు చైర్మన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి క్రీడాకారులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో అండర్-12 బాస్కెట్‌బాల్ జిల్లా స్థాయి లీగ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను ఆత్మీయట్రస్టు చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, బాస్కెల్బాల్ అసోషియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక,శారీరక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు సంజయ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా క్రీడాకారులతో కోచ్‌లు, ట్రస్టు సభ్యులు

పేదల సంక్షేమమే వైసిపి ధ్యేయం

ప్రజాశక్తి - కొత్తచెరువు

పేద ప్రజల సంక్షేమమే వైసిపి ధ్యేయమని ఎమ్మెల్యే డి.శ్రీధర్ రెడ్డి తెలిపారు. కొత్త చెరువులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజర్ బోర్డు చైర్మన్ రమణారెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి, నాయకులు షాజహాన్, నాగభూషణ ,పోతిరెడ్డి, గంగరాజు, సరళ, నాగరాజు, శ్యాంసుందర్ రెడ్డి ,సోమశేఖర్ రెడ్డి, సర్పంచులు అలివేలమ్మ, రత్నమ్మ, గీతా బాయ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మండల పరిధిలోని కుమ్మరవాండకపల్లి -1 గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చేతుల మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 7వవార్డులో కౌన్సిలర్ గడ్డంవరలక్ష్మి, వార్డు ఇన్‌ఛార్జి గడ్డంరంగా, వైసిపి పట్టణ అధ్యక్షులు నీలూరుప్రకాష్ చేతుల వీదుగా వార్డులోని లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శంకర యుగంధర్, గాజుల శంకర, బొమ్మిశెట్టి బాలరాజు, రవీంద్ర రెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామానాయక్, ఎంపీపీ జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ జి రవీంద్రారెడ్డితో పాటు నాయకులు ఫయాజ్ అలీ, భాస్కర్ రెడ్డి, సర్పంచులు రహమతుల్లా రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు

బుక్కపట్నం : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్లను స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగలక్ష్మి రాజు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి,అగ్రి అడ్వైజర్ చైర్మన్ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతి, ఎంపీడీవో శ్రీనివాసులు, నాయకులు పతాంజలి, నాగభూషణం, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : ఇచ్చిన మాట ప్రకారం అవ్వ తాతలకు పింఛన్ల మొత్తం పెంచి సకాలంలో అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని వైసిపి నాయకులు తెలిపారు. 'వైఎస్ఆర్ పింఛను కానుక' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 17వ వార్డులో కౌన్సిలర్ సుభద్రనాగేంద్ర ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. కౌన్సిలర్ మాట్లాడుతూ ఇక నుంచి పింఛను నెలకు రూ. 3వేలు అందుతుందని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హిందూపురం : జగన్ మోహన్ రెడ్డి తీసుకోచ్చిన సంక్షేమ పథకాలతో బడుగు బలహీన నిరుపేదల జీవితాల్లో వెలుగులు ప్రకాశిస్తున్నాయని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఎ బ్లాక్ కన్వీనర్ సిపిసి సాదిక్, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

లేపాక్షి : మండల పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన ఓ మహిళను అరెస్ట్ చేసి, కర్నాటక మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. కొండూరు గ్రామానికి చెందిన ఒకరిని అరెస్ట్ చేసి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా కర్నాటక మద్యం అమ్మితే ప్రజలకు పోలీసులకు కానీ, 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. వారి సమాచారం గోప్యంగా ఉంచి మద్యం విక్రేతలపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

బుక్కపట్నం : మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి ఇంటివద్ద కర్నాటక మద్యం విక్రయిస్తున్నట్ల సమాచారం రావటంతో తనిఖీలో నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకొని రెండు కర్నాటక మద్యం ఫుల్ బాటిళ్లు, 62 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

కదిరి టౌన్ : రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా రోడ్డు ప్రమాదాలపై శుక్రవారం పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఉన్న మున్సిపల్ హై స్కూల్ నందు ఎంవిఐ వరప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కదిరి ఎంవిఐ ప్రసాద్, రోటరీ క్లబ్ మెంబర్ కిషోర్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రహదారి భద్రత ప్రమాణాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం విద్యార్థు లకు రహదారి భద్రత నియమాలు - రహదారి ప్రమాదాల నివారణ పై వ్యాచా రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన ముగ్గురు విద్యార్థులకు హెల్మెట్ నగదు ప్రోత్సాహక బహుమతులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. నాగరాజు, ఎంవిఐ రాజేష్, కిషోర్ కుమార్ రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు రమణ, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

కదిరి టౌన్ : గ్రామీణ ప్రాంత పేదలకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి రూరల్ మండలం, కుమ్మరవాండ్ల పల్లి -1 గ్రామ సచివాలయం పరిధిలో నూతనంగా నిర్మించిన వెల్నెస్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గడపకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా గ్రామ సచివాలయం పరిధిలో వెల్నెస్ సెంటర్‌ను, ప్రతి మండల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అర్బన్ పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు పూర్వవైభవం'

ధర్మవరం టౌన్ : వైఎస్ షర్మిల పార్టీలో చేరికతో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో మరింత బలపడుతుందని ధర్మవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రంగన అశ్వత్థ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వారసురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో పూర్వ వైభవం వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామం అని అన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

పుట్టపర్తి క్రైమ్ : టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమనిఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం పుట్టపర్తిలో స్టేట్ బ్యాంక్ రోడ్డులో నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి మినీ మేనిఫెస్టో లోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు ఇన్‌ఛార్జి బేకరీ నాయుడు, నాయకులు బద్రీనాథ్ చౌదరి, యశ్వంత్ నాయుడు, లింగప్పగారిపల్లి రవి, వాల్మీకి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం

ముదిగుబ్బ : మండల పరిధిలోని మలక వేముల క్రాస్, ఎనుములవారిపల్లి, నాగారెడ్డిపల్లి, మలక వేముల, తదితర గ్రామాలలో స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇంటింటి ప్రచారాన్ని శుక్రవారం చేపట్టారు. ఈసందర్భంగా ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, సర్పంచి శ్రీనాథ్ గౌడు, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీల భవిష్యత్తు కార్యాచరణపై చర్చ

కదిరి అర్బన్ : అంగన్వాడీల భవిష్యత్తు కార్యాచరణపై నాయకులు చర్చించారు. స్థానిక రోడ్డు భవనాల శాఖ అతిథిగృహ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐటియు నాయకులు జివిఎల్ నరసింహులు, జగన్మోహన్, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు మాబున్నీసా తదితరులు పాల్గొని భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాలపై చర్చించారు. తమ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దిగి రాకపోతే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు టిడిపి మద్దతు

ధర్మవరం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమ్మెకు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను డిమాండ్ చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో జగనన్న సురక్ష రెండవ విడత కార్యక్రమాన్ని ఎంపీపీ ఎవి రమణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు వివిధ వ్యాధులకు చికిత్సలు పొందారు. వైద్యులు డాక్టర్ నికిత ,అభినవరెడ్డి , నిషా బేగం తదితరులు వైద్య సేవలు అందించారు. కంటి వైద్య నిపుణులు జగదీష్ పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శుబదాస్, జిల్లా వైద్యాధికారి ఎస్‌వి. కృష్ణారెడ్డి, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి , ఈవో ఆర్ డి అశోక్ కుమార్ రెడ్డి, సర్పంచి మంగ్లీ బాయ్, శ్రీ సత్య సాయి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుపాల్ నాయక్, మాజీ కన్వీనర్, గంగాధర్ ఉపసర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సరస్వతి బాయ్ పాల్గొన్నారు.

సోమందేపల్లి : రెండవ విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా శుక్రవారం స్థానిక ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి, నాయకులు రమాకాంత్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాషా, జగదీష్‌రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.